ప్రజాశక్తి
సోమవారం 08 ఏప్రిల్ 2024
5
కర్నూలు



నడక భక్తులకు అవస్థలు

- ఉగాది ఉత్సవాలకు సిద్ధమైన శ్రీశైలం - పూర్తి స్థాయి ఏర్పాట్లలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఉగాదికి శ్రీశైలానికి వెళ్లే నడక భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఉగాది ఉత్సవాలకు శ్రీశైలం సిద్ధమైంది. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి...


శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు ఈనెల 6 నుంచి ప్రారంభమయ్యాయి. ఐదురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు ఈ నెల 10కి ముగియనున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఇప్పటికే అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని చేరుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థమై అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులు సేద తీరేందుకు పలుచోట్ల చలువ పందిళ్లు వేశారు. పలుచోట్ల వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ఆరుబయట ప్రదేశాల్లో పలుచోట్ల తాత్కాలిక విద్యుద్దీకరణ సౌకర్యం కల్పించారు. వేకువజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజల అనంతరం వేకువజామున 4.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కూడా దర్శనాలు కొనసాగుతాయి. మొత్తం మూడు క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. శ్రీవృద్ధమల్లికార్జున స్వామివార్లకు అభిషేకం, శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణం ఆర్జితసేవా కర్తలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకు దేవస్థానం యూనిట్ అధికారులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ఉగాది ఉత్సవాలలో క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు మరియు మంచినీరు, మజ్జిగ అందిస్తున్నారు. ఉగాది ఉత్సవాలలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేశారు. మొత్తం 10కౌంటర్ల ద్వారా ఈ లడ్డు ప్రసాదాలు విక్రయిస్తున్నారు. భక్తుల రద్దీకనుగుణంగా నీటిసరఫరా చేయడం జరుగుతోంది. రోజుకు 1 కోటి 35 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయడం జరుగుతోంది. క్షేత్రపరిధిలో పలుచోట్ల గల సుమారు 450 పైగా మంచినీటి కుళాయిలను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. క్షేత్రపరిధిలో శాశ్వతంగా గల 11 ఆర్.సి.సి. వాటర్ ట్యాంకులను కూడా అందుబాటులోకి తెచ్చారు. క్షేత్రపరిధిలో 34 ఆర్.ఓ ప్లాంట్లను కూడా భక్తులకు అందుబాటులో ఉంచారు. భక్తులు సేదతీరేందుకు వీలుగా టోలేట్ వద్ద గల బసవవనం, సిబ్బంది వసతి గృహాల వద్ద గల బాలగణేశవనం, పాతాళగంగమార్గములోని శివదీక్షా శిబిరాలు, ఆలయ పుష్కరిణి వద్దగల శ్రీపర్వతవనం, ఆలయ దక్షిణమాడవీధిలో గల రుద్రాక్షవనం, శివాజీగోపురానికి ఎదురుగా గల శివాజీవనం మొదలైన చోట్ల ఈ చలువపందిర్లు వేయబడ్డాయి. అలాగే మాడవీధిలో కూడా చలువపందిర్లు వేశారు. అదేవిధంగా కాలిబాట మార్గములోని వెంకటాపురం, నాగలూటి, దామర్లగుంట, పెద్దచెరువు, కైలాసద్వారం, మొదలైనచోట్ల కూడా చలువపందిర్లు ఏర్పాటు చేశారు. అధికారులు ఇన్ని ఏర్పాట్లు చేశామని చెప్పుకుంటున్నా కర్ణాటక నుంచి వచ్చే కాలినడక భక్తులకు అవస్థలు తప్పడం లేదు. నీటి సౌకర్యం లేదు ఖాళీ టాంకులు దర్శనం ఇస్తున్నాయి. మినరల్ వాటర్ కాకుండా సాధారణ నీళ్లు నింపిన నీళ్ళ బాటిల్ రూ.30, రూ.40కు విక్రయిస్తున్నారు. మూడు మిరపకాయ బజ్జీలను రూ.30కు విక్రయిస్తున్నారు. అనధికారికంగా, అధిక ధరలకు విక్రయాలు సాగుతున్నా దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీటి సౌకర్యం కల్పించాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో కాలినడక భక్తులకు నీటి సమస్య తప్పడం లేదు.



కాలినడకన శ్రీశైలం వెళ్తున్న భక్తులు

ఎండలో జాగ్రత్తలు తప్పనిసరి

- వేసవికాలంలో సార్వత్రిక ఎన్నికలు
- వడ దెబ్బ తగిలిన వారికి ప్రాథమిక చికిత్స చేయించాలి
- ప్రజాశక్తితో డిఎంహెచ్ఓ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వడ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే ఇదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎండ వేడిమిని తట్టుకునే విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. వడదెబ్బ గురించి, ఎన్నికల ప్రక్రియలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ తీసుకుంటున్న చర్యలపై డిఎంహెచ్ఓ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్‌తో ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సమయంలో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

డిఎంహెచ్ఒ : గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతను అధిగమించడానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర పనులు ఉంటేనే బయటకు వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. జిల్లాలోని 28 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటిల్లో అవసరమైన ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అయోడిన్, సెలైన్ బాటిల్స్, ఇంజక్షన్లు, కట్లు కట్టేందుకు అవసరమైన కిట్ బ్యాగ్‌లను అందుబాటులో ఉంచాం.

శ్రీశైలానికి కర్ణాటక భక్తులు పాదయాత్ర ద్వారా వెళుతున్నారు. వారికి ఎలాంటి సేవలను అందిస్తున్నారు?

డిఎంహెచ్ఒ : కర్నూలు జిల్లాలోకి ఆదోని, మంత్రాలయం ప్రాంతాల్లో కర్ణాటక భక్తులు ప్రవేశించి శ్రీశైల దేవస్థానానికి పాదయాత్ర ద్వారా వందలాది మంది వెళ్తున్నారు. వీరందరికీ అక్కడక్కడ ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాలను కొందరు భక్తాదులు శిబిరాలను ఏర్పాటు చేశారు. అలాంటి శిబిరాల వద్ద వైద్య సిబ్బందిని నియమించి భక్తులకు వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రధానంగా భక్తుల్లో కాళ్లకు బొబ్బలు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారందరికీ డ్రెస్సింగ్ చేయించి అవసరమైన సూది మందు అందించి కట్లు కట్టించడం జరుగుతుంది. వడదెబ్బ తీవ్రతను గుర్తించి ప్రథమ చికిత్స అందిస్తున్నాం. ఇంకా తీవ్రత అధికంగా ఉన్న వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్సలను అందిస్తున్నాం. వైద్య చికిత్సలను అందించేందుకు ఒక ఏఎన్ఎం ఒక ఆశా కార్యకర్త మెడికల్ స్టాక్ తీసుకుని ప్రతి శిబిరం వద్ద ఉంటారు.

వేసవిలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డిఎంహెచ్ఒ : జిల్లాలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరగనున్నాయి. సుమారు రెండు వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రధానంగా రెండు లేదా అంతకన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రతి చోట ఒక మెడికల్ టీంను ఏర్పాటు చేశాం. ఈ టీంలో ఒక ఎఎన్ఎం లేదా ఎంఎల్‌హెచ్‌పి, ఒక ఆశా కార్యకర్త ఉంటూ సేవలు అందిస్తారు. ఈ విధంగా జిల్లాలో 1100 లోకేషన్లను గుర్తించాం. మెడికల్ టీంకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మెడికల్ కిట్లు అందించాం. జిల్లాకు 4 లక్షలు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అవసరమని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 70 వేల ఒఆర్ఎస్ ప్యాకెట్లను మెడికల్ కేంద్రాలకు అందజేశాం.

ఇంకా ఏమైనా ప్రత్యేక మెడికల్ కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్నారా..?

డిఎంహెచ్ఒ : జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వేసవిలోనే జాతరలు జరుగుతుంటాయి. అలాంటి ప్రదేశాల్లో కూడా మెడికల్ టీం ను ఏర్పాటు చేసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. బాధితులు ఉంటే వారికి ప్రథమ చికిత్సలు అందించి ఉపశమనం కలిగిస్తున్నాం. ఇంకా తీవ్రంగా ఉన్నవారిని గుర్తించే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి వైద్య చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. జాతరలో ప్రధానంగా డయేరియా విజంభించే అవకాశం ఉంటుంది అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా వైద్య సిబ్బందిని సిద్ధం చేశాం.

జిల్లాలో ఇమ్యునైజేషన్ కార్యక్రమం ఎలా జరుగుతుంది?

డిఎంహెచ్ఒ : జిల్లాలో ఇమినేషన్ కార్యక్రమం క్రమం తప్పకుండా కొనసాగుతుంది. చిన్నారులకు, గర్భవతులకు, బాలింతలకు షెడ్యూల్ ప్రకారం ఇచ్చే టీకాలను పౌష్టికాహార సరఫరాను వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారు ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న అనుకూల సమయాల్లో వారి వద్దకు సిబ్బంది వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.



వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐలను గెలిపించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ప్రభుత్వ విధానాలపై ట్రేడ్ యూనియన్ల వర్క్ షాప్ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. సిహెచ్.నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, దానికి వంతపాడే టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించి వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించుకున్నప్పుడే కార్మిక రాజ్యం వస్తుందన్నారు. పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నారన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులకు ఏ ఒక్క చట్టం చేయకపోగా ప్రభుత్వ రంగాలన్నింటిని ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. వైద్య రంగం ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారన్నారు. చదువును చైతన్య, నారాయణ లాంటి కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. రైల్వేలో 3.25 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అన్నింటిని దివాలా తీయించి ప్రైవేటు వారికి అప్పజెప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. విద్యుత్తు, ట్రాన్స్‌పోర్టు రంగాలలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగస్తులు అందరూ తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తుంటే అలాంటి వార్తలు రాకుండా మోడీ మీడియాను తమ గుప్పిట్లో పెట్టుకున్నాడని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు వారికే అప్పచెప్పేందుకు కనీస వేతనం ఇవ్వకుండా రిక్రూట్మెంట్లు జరుపకుండా ఉన్న వారిపై పని భారం పెంచేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల చట్టాలు అమలు చేస్తే వారికి గ్రాట్యుటీ, పెన్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని, అందుకే మోడీ తన పాలనలో ఉన్న వారిని తొలగించడం తప్ప కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేసిన దాఖలాలు లేవన్నారు. సిఐటియు నాయకత్వంలో పోరాటాలు చేయడం వల్లనే అంగన్వాడీ, ఆశ, 104, మున్సిపల్ కార్మికులకు తల వంచి గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్‌ను ఏర్పాటు చేసి రాతపూర్వకంగా హామీలు ఇచ్చే విధంగా చేసుకోగలిగాం అన్నారు. కార్పొరేటర్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ పార్లమెంటులో చట్టాలు చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న టిడిపి, వైసిపి, జనసేన ప్రతి దానికి మద్దతు తెలియజేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు కార్మిక వర్గం వైపు ఉన్నాయో లేక కార్పొరేట్ సంస్థల వైపు ఉన్నాయో ఆలోచించాలన్నారు. ప్రభుత్వాలు చట్టాలు అమలు చేయడం లేదని ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలో తేల్చుకొని కార్మిక వర్గ రాజ్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెట్టుబడి దారి వ్యవస్థను మార్చి కార్మిక విధానాలను బలపరిచే వారికి మద్దతు పలికే వారిని ఎన్నుకోవాలని సూచించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో అమలు చేసే బిజెపి అంటే బాబు, జగన్, పవన్‌లకు ఓటు వేస్తే బిజెపి అనే శత్రువుకు ఓటు వేసినట్లేనని చెప్పారు. వాటికి ప్రత్యామ్నాయంగా ఉన్న సిపిఎం, సిపిఐ అభ్యర్థులకు ఓటును వేయాలని, తమతో సంబంధాలు ఉన్న వారందరికీ చెబుతూ ఓట్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, నంద్యాల జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జెసి నారపురెడ్డి మౌర్య
- కౌంటింగ్ హాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ను, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించి తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జెసి నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాళ్లను, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో కలిసి జెసి భవనాలను పరిశీలించారు. రాయలసీమ యూనివర్సిటీ ఆవరణం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పరిశుభ్రం చేసి పార్కింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు రానున్న వాహనాలకు పార్కింగ్ చేసుకునే విధంగా సదుపాయం కల్పించాలని ఆమె సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తాగునీరు, భోజన సదుపాయం, బాత్ రూం సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్లూరు తహశీల్దార్ మునివేలు, మున్సిపల్ ఇంజినీర్ రవి ప్రకాష్ పాల్గొన్నారు.



వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జెసి నారపురెడ్డి మౌర్య



టిడిపి చేరిన యువకులకు కండువా వేసి ఆహ్వానిస్తున్న గౌరు దంపతులు

టిడిపి విజయానికి రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ కృషి

గౌరు దంపతుల సమక్షంలో పలువురు యువకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ వారు గౌరు చరిత వెంకట రెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి మీ విజయానికి కృషి చేస్తామని మద్దతు తెలిపారు. కల్లూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన యువకులు గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు, వారికి గౌరు దంపతులు పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించి తమ మొదటి ఓటు తెలుగుదేశం పార్టీకి వేస్తామని అనడం చాలా సంతోషం అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి అన్నారు. యువత కోసం చంద్రబాబు గతం లో ఉపాధి అవకాశాలు చంద్రబాబు కల్పించారని తెలిపారు. పార్టీ లో చేరిన యువకులు జయకుమార్, వినోద్, విజయ్, హ్రితిక్, శేఖర్, చందు, లికిత్, శివ, మధు చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, మండల నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి, గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రాయపాటి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న లయన్ చంద్రప్రకాష్, తదితరులు

లయన్స్ క్లబ్స్ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు

లయన్ చంద్రప్రకాష్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ చంద్రప్రకాష్ అన్నారు. ఆదివారం ప్రొద్దుటూరులో జరిగిన 2022 -23 సంవత్సరానికి గాను విశిష్ట సేవలు అందించిన లయన్స్ క్లబ్‌లకు అవార్డుల కార్యక్రమంలో ఆ సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధిగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు జిల్లా గవర్నర్ ఏరియా రిప్రజెంటిటేటివ్‌గా ఉత్తమ సేవా అవార్డును గవర్నర్ లయన్ చంద్రప్రకాష్ , ఇతర పాస్ట్ డిస్టిక్ గవర్నర్ల చేతుల మీదుగా అందజేశారు. అవార్డు గ్రహీత డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ లయన్స్ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరింప చేస్తామన్నారు.

ఐఎంఎ హెల్త్ మేనిఫెస్టో విడుదల

హెల్త్ మేనిఫెస్టో అమలుకు రాజకీయ పార్టీలకు సూచన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు ఐఎంఎ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ శాఖ తరపున రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జయచంద్ర నాయుడు, ఐఎంఎ రాష్ట్రమాజీ అధ్యక్షులు రాష్ట్ర యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి .రవికృష్ణ, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.బాల మద్దయ్య, కర్నూలు శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ మాధవి. శ్యామల, జాతీయ ఐఎంఎ రూపొందించిన హెల్త్ మేనిఫెస్టో వివరాలను వెల్లడించారు. వారు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి లో భాగంగ 1948 లో ఏప్రిల్ 7 వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భవించిన రోజును ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఒక ఆరోగ్య అంశంపై దృష్టి సారించి, ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణపై దీర్ఘకాలిక ప్రణాళికతో, నిర్దిష్ట లక్ష్యాలతో, వివిధ వర్గాలలో, వివిధ స్థాయిలలో విస్తృత చర్చలు జరపడం,ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా ప్రపంచ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా "నా ఆరోగ్యం.నా హక్కు అని ప్రకటించారని అన్నారు. జీవించే హక్కుతో పాటు ఆరోగ్యం కూడా ఒక హక్కుగా ప్రజలకు కల్పించాలన్నదే దీని లక్ష్యం అన్నారు. మనదేశంలో కేంద్రం , అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జిడిపిలో 1.1 నుండి 1.6 శాతం మాత్రమే సగటున ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నాయని, ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువని అన్నారు. ఇందులోనే తాగునీటికి, పారిశుధ్యానికి కేటాయింపులు చేయడం జరుగుతున్నదని తెలిపారు. తాగునీటికి, పారిశుధ్యానికి విడిగా నిధులు కేటాయిస్తూ, ప్రత్యేకంగా వైద్య ,ఆరోగ్య రంగానికి జిడిపిలో 2.5శాతం నిధులు ప్రస్తుతం కేటాయించి, క్రమంగా 5.5 శాతానికి పెంచవలసిన అవసరం ఉందన్నారు. మందులపై ప్రస్తుతం 5 నుంచి 18 శాతం ఉన్న జిఎస్‌టిని తీసివేసి ప్రజలు మందుల కోసం వెచ్చించే ఖర్చు భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సరైన వైద్య సదుపాయాలతోపాటు ప్రజల ఆరోగ్యానికి కారకాలైన రక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత పై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉందన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఐఎంఎ పాత్ర

ఆధునిక వైద్యాన్ని అందిస్తున్న 4 లక్షల మంది వైద్యులు సభ్యులుగా కలిగి దేశంలో 1764 శాఖలు ఉన్న భారతీయ వైద్య సంఘం దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించడానికి అవకాశం ఉందన్నారు. ఐఎంఏ ప్రపంచంలోనే అతిపెద్ద వత్తి నిపుణుల సంస్థ అని దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించే సమయంలో ఐఎంఏను భాగస్వామ్యం చేయడం అవసరమన్నారు.

ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టో

గత సంవత్సరం డిసెంబర్ నెలలో తిరువనంతపురంలో జరిగిన 95వ ఐఎంఏ జాతీయ మహాసభల సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, విభిన్న రంగాలకు చెందిన మేధావులు వరస సమావేశాలు నిర్వహించి రానున్న 50 సంవత్సరాల కాలానికి దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఈ హెల్త్ మేనిఫెస్టోను సాధారణ ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అందజేస్తామన్నారు. ఆయా రాజకీయ పక్షాలు ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టోని అధ్యయనం చేసి తమ పార్టీ మ్యానిఫెస్టోలలో పొందుపరచడానికి గల అవకాశాలు పరిశీలించాలని కోరారు

వలసలు ఆపి ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :వేసవిని గమనంలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చొరవ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కర్నూలు మండలం ముఖ్య నాయకుల సమావేశం సీనియర్ నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన సుందరయ్య భవన్లో నిర్వహించారు. కెవి. నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే వేసవి ప్రారంభమై ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ఎండ తీవ్రతతో ఇంటి నుండి బయటికి కూడా రాలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని అన్నారు. ఈ పరిస్థితులలో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న పరిస్థితి మండలంలో ఉందని, మూడు రోజులకు ఒకసారి నాలుగు రోజులకు ఒకసారి మంచినీళ్లు అందించే పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే ప్రజలు వేసవి దాటికి గురికావాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎండల నుండి విముక్తి కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు, సన్న చిన్న కారు రైతాంగానికి ఏ పనులు లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, అందుకు అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి పనిచేసిన వారంలోగా వేతనాలు చెల్లించి ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేందుకు కృషి చేయాలని, కనీసం ప్రతి కుటుంబానికి మూడు పూటలా తిండి పెట్టేలా పథకం అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు, మృత్యుంజయుడు. ఆంజనేయులు పాల్గొన్నారు.



వేసవి కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం

వేసవి కంప్యూటర్ శిక్షణను ప్రారంభించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచవ్యాప్తంగా డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో కంప్యూటర్ పై పరిజ్ఞానం లేకుండా ఏ రంగంలోనూ రాణించడం కష్టమని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు భాగ్యనగర్‌లోని ఫస్ట్ స్టెప్ కంప్యూటర్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విద్యార్థులకు వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఫస్ట్ స్టెప్ కంప్యూటర్స్ అధినేత రాజశేఖర్ ,మేనేజర్ సుజాత పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసి ఖాళీగా ఉన్న విద్యార్థులు వేసవిలో సమయం వృధా చేయకుండా కంప్యూటర్ పై పరిజ్ఞానం పొందించుకునేందుకు వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు సాధారణంగా వేసవి సెలవులను ఇతర కార్యక్రమాలతో సమయం వృధా చేయడం సహజంగా జరుగుతుందని చెప్పారు. అలాకాకుండా ఈ వేసవి సెలవులను కంప్యూటర్ శిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫస్ట్ స్టెప్ కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం ,అందులో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 24 సంవత్సరాలుగా ఫస్ట్ స్టెప్ కంప్యూటర్ సెంటర్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగులకు కంప్యూటర్ పై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించిన సంస్థ అధినేత రాజశేఖర్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన డాక్టర్ శంకర్శర్మకు రాజశేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -పత్తికొండ : టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కంపెనీ వారు రైతు రామాంజనేయులు భూమిలో అక్రమంగా తవ్వకాలు నిలిపివేయాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఈశ్వర్ రెడ్డి భవనంలో పత్రికా విలేకరుల సమావేశంలో రంగారెడ్డి, రైతు రామాంజనేయులు మాట్లాడుతూ పత్తికొండలోని సర్వే నంబర్ 2861ఎ - 2.20 భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెల రోజులు నుండి తమ పొలంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పేర అక్రమంగా తవ్వకాలను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చినా పనులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కంపెనీ వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆస్పరి జొహరాపురంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్

వీరభద్ర గౌడ్ సుడిగాలి పర్యటన

- వైసిపి నుంచి టిడిపిలోకి భారీ చేరికలు
- ఆలూరులో టిడిపికి పూర్వ వైభవం తెస్తాం
- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ ఆదివారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. మండలంలోని మొలగవల్లి గ్రామం, ఆస్పరి మండలం జొహరాపురం, హోళగుంద మండలం సులువాయి గ్రామంలో పర్యటించారు. మొలగవల్లిలో బీరప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తూ, ఆత్మీయంగా పలుకరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జొహరాపురంలో వీర బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైసిపికి చెందిన జనార్ధన్ అనుచరులు 50 కుటుంబాలు వెంకటేష్ చౌదరి ఆధ్వర్యంలో టిడిపిలో చేరాయి. వీరభద్రగౌడ్ వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సులువాయి గ్రామంలో 50 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. శివశంకర్ అనుచర వర్గానికి వీరభద్రగౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి ఆలూరు కార్యాలయంలో గూళ్యం గ్రామం నుంచి 50 కుటుంబాలు, ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు రమేష్ శెట్టి అనుచరులకు వీరభద్ర గౌడ్ టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరభద్ర గౌడ్ మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం తెస్తామని, కార్యకర్తలే పార్టీకి పునాదులని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తమ భవిష్యత్తు కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం టిడిపి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్



వీరభద్ర గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

వైసిపి మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా తీస్తుందని టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్ర గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని సులువాయి, ములుగుందం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా తీయడమే కాకుండా రౌడీయిజం, దౌర్జన్యాలు పెరిగిపోతాయని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా, సురక్షితంగా జీవించాలంటే టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అకౌంట్‌లో జమ చేస్తున్నామని బటన్ నొక్కి నెలరోజులు గడుస్తున్నా నేటికీ ఏ ఒక్కరికీ జమ చేయలేదని తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రి అవసరమా అని ప్రశ్నించారు. దీపం పథకం, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక వంటి పథకాలు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం దోచుకొని దాచుకోవడానికే సరిపోయిందని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంత్యుత్సవ సభ

- కరపత్రాలను విడుదల చేసిన కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 14న పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంత్యుత్సవ సభను జయప్రదం చేయాలని అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవ సహాయం, ఛైర్మన్ మాల ఉసేని, కమిటీ కో కన్వీనర్లు జి.ఆనంద్ చైతన్య మాదిగ, కదిరికోట ఆదెన్న కోరారు. ఆదివారం స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో ఉత్సవ కమిటీ నాయకులతో కలిసి జయంత్యుత్సవ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళితుల ఐక్యతను ప్రదర్శిస్తూ ఈనెల 14న ఆదివారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలో ఎంబి చర్చి దగ్గర ఆది ఆంధ్ర పాఠశాల నుంచి సభా స్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో వందలాది డప్పులతో, డప్పుల దరువు, కర్ర సాము విన్యాసాలు, సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉదయం 10.30 అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తామని తెలిపారు. అనంతరం అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ ఛైర్మన్ మాల ఉసేని అధ్యక్షతన సభ ప్రారంభమవుతుందని చెప్పారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ సభ్యులు రుద్రాక్షల పెద్దయ్య, సోగనూరు ఆనందరావు, కనకవీడు రాజు, రోజా ఆర్ట్స్ ఉసేని, ఎస్.రాజు, కె.ప్రసాద్, కె.ఏసేపు, కలుగొట్ల మాల రాజా రమేష్, కనకవీడు పురుషోత్తం, ఆరోను పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డు (ఇందిరా నగర్, ఉప్పర కాలనీలో) పర్యటించారు. వార్డులోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రజలను పేరుపేరునా ఆప్యాయంగా పలుకరిస్తూ వైసిపి హయాంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి సమస్యనూ పరిష్కరించి, వార్డులో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని భరోసా ఇచ్చారు. అభివృద్ధి అంటే ఒక్క టిడిపి, బీవీ కుటుంబానికే సాధ్యమని ప్రజలకు వివరించారు. అనంతరం గోనెగండ్ల మండలం వెముగోడు గ్రామానికి చెందిన డిడ్డికాటి కుటుంబ సభ్యులు టీచర్ చిన్న అంపన్న, భాస్కర్, జనార్ధన్, మాదన్న, చిన్న హనుమంతు, నాయుడు, భద్రి, శ్రీనివాసులు, అంపన్న, శేఖర్, పెద్దయ్య, వెంకటేశ్వర్లు, ఒబులేసు, మద్దిలేటి, పొబ్బ వెంకటేశ్వర్లు, దస్తగిరి, పాండురంగడు, భాస్కర్, రవి వారి అనుచరులు సుమారు 100 కుటుంబాలు టిడిపి వెముగోడు గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహుడు, కమిటీ సభ్యులు గుంటుపల్లి స్వామి, జగదీష్ ఆధ్వర్యంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన వారు మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు మాయమాటలు నమ్మి వైసిపికి ఓట్లు వేసి అఖండ మెజారిటీతో అధికారాన్ని కట్టబెడితే 'అన్న' ఆచూకీ లేదని, మంచి రోజుల జాడా కనబడలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పాలనతో విసిగి వేసారామని తెలిపారు. టిడిపి ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులమై టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తాం

- వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి
- నేమకల్లులో వైసిపి కార్యాలయం ప్రారంభోత్సవం
- విరుపాక్షికి ఘన స్వాగతం పలికిన నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజలు చూపిస్తున్న అభిమానం, ఆశీర్వాదమే తనకు శ్రీరామరక్ష అని, వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని, అందులో ఏమాత్రం సందేహం లేదని వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి తెలిపారు. ఆదివారం నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్‌కుమార్, కో కన్వీనర్ సత్తిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు గిరి, గురునాథ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయాన్ని విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విరుపాక్షి రాక సందర్భంగా సర్పంచి ప్రేమ్ కుమార్, ఎంపిటిసిలు సుంకన్న, భీమలింగ, వైసిపి గ్రామ నాయకులు పెద్దఎత్తున పూలమాల, శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ ప్రధాన రహదారి వెంట అందరికీ నమస్కరిస్తూ వెళ్లి రాంపురమయ్య స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసిపిలో కష్టపడే వారందరికీ సముచిత స్థానం కల్పిస్తున్న జగన్మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు రూ.కోట్లు ఉన్న వారికే సీట్లు కేటాయిస్తూ జగన్మోహన్‌రెడ్డిపైనే ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, మాజీ కన్వీనర్ ఓబులేసు, సేనాపతి, రామచంద్ర, గురుదాసు, మోహన్, శ్రీనివాసులు, మాబు ఉసేని, విద్యా కమిటీ ఛైర్మన్ అశోక్, గోవిందరాజులు, సుంకన్న, జయరాం, రంగస్వామి, నెట్టి, డీలర్ లక్ష్మన్న, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా మాట్లాడుతున్న విరుపాక్షి

అండగా ఉంటా.. ఆదరించండి

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి - హోళగుంద

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, తనను ఆదరించాలని వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి కోరారు. ఆదివారం ఆయన హోళగుందలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. తనను ఆదరించి రానున్న ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీటి సమస్య ఇంకా వెంటాడుతోందని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామీణ రోడ్లతో పాటు ముఖ్యమైన మండలాల రోడ్లు కూడా మంజూరు చేయించి మరమ్మతులు చేపడతానని హామీఇచ్చారు. కొందరు మహిళలు సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల అనంతరం సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారని వివరించారు. వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, మండల నాయకులు ఈసా, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లికార్జున, హనుమప్ప, కోగిలతోట శేషప్ప పాల్గొన్నారు.



హోళగుందలో మాట్లాడుతున్న విరుపాక్షి



కిట్లను పంపిణీ చేస్తున్న నూర్ అహ్మద్

పేద ముస్లిం, మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

రంజాన్ మాసం సందర్భంగా తనవంతుగా పేదలకు సహాయం చేయాలన్న ఉద్దేశంతో 250 మంది పేద ముస్లిం, మైనార్టీ మహిళలకు రంజాన్ తోఫా కిట్లు అందజేసినట్లు సోషల్ వర్కర్ నూర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం స్థానిక హవేలీ ఫంక్షన్ హాలులో రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ముబీన్ అహ్మద్, సాధిక్ నిజామి, ఎపియుడబ్ల్యుజె తాలూకా కార్యదర్శి మహ్మద్ హుస్సేన్, అడ్వకేట్ హుస్సేన్ సాని, ఉర్దూ పేపర్ సీనియర్ జర్నలిస్ట్ సిరాజుల్ హక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు చేయాలంటే అదృష్టం ఉండాలన్నారు. మెకానిక్ పని చేస్తూ పేదవాడైన పెద్ద మనస్సుతో నూర్ అహ్మద్ 250 మంది పేదలకు రంజన్ తోఫా ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. 2.5 కిలోల బియ్యం, 2.5 కిలోల గోధుమ పిండి, అరకిలో సేమియాలు, మంచి నూనె, డాల్డా ప్యాకెట్లు ఒక కిట్టుగా చేసి పంచడంతో చాలామంది పేదలకు పండగకు అత్యవసరమని చెప్పారు. గత మూడేళ్ల నుంచి రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నూర్ అహ్మద్‌ను అభినందించారు. రాబోయే కాలంలో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎలాంటి అవసరమైనా తమ వంతుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పేద ముస్లిం, మైనార్టీల కోసం డాక్టర్ ముబీన్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు టోకన్లు పంపిణీ చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు సిద్ధం కావాలి : జనసేన

ప్రజాశక్తి-ఆలూరు

వైసిపి పాలన నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రజలు సంసిద్ధం కావాలని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప కోరారు. ఆదివారం ఆయన నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారందరిపై కేసులు పెట్టి హత్య రాజకీయాలు చేస్తున్న జగన్‌ను గద్దె దించాలని కోరారు. మన భవిషత్తు మనం వేసే ఓటుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. జనసేన అధిష్టానం పిలుపు మేరకు ఎలాంటి గ్రూపు విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని కోరారు. అందుకు నియోజకవర్గ ప్రజలు, జనసేన నాయకులు, జన సైనికులు సంసిద్ధం కావాలని తెలిపారు.

పవన్ కల్యాణ్ త్యాగం, ధైర్యం.. యువతకు ఆదర్శం

- టిడిపి అభ్యర్థి రాఘువేంద్ర రెడ్డి - జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మంత్రాలయం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ చూపిన త్యాగం, ధైర్యం యువతకు ఆదర్శమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కొనియాడారు. ఆదివారం మండలంలోని మాధవరం గ్రామంలో ఆయన స్వగృహం ఆవరణంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న అధ్యక్షతన జనసైనికులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపి, బిజెపిలను కలిపి, చివరకు సీట్ల సర్దుబాటులో కూడా పవన్ కల్యాణ్ త్యాగం చేశారని తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు స్పందించి ధైర్యంగా ముందుకొచ్చి మద్దతు ప్రకటించిన వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కచ్చితంగా విజయం సాధిస్తుందని, చంద్రబాబు కూడా ఆయనకు సముచిత స్థానం కల్పిస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు బీసీలకు టికెట్ కేటాయించారని, నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలు తనకు అండగా ఉండాలని కోరారు. జనసైనుకులను గుండెల్లో పెట్టుకునే బాధ్యత తనదని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఏ సమస్య వచ్చినా 'మీ ముందు నేనుంటాన'ని భరోసా ఇచ్చారు. అనంతరం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డిని ఓడించడమే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని సూచించారు. జన సైనికులందరం కంకణం కట్టుకొని రాఘవేంద్రరెడ్డి గెలుపు కోసం కృషి చేద్దామని జనసేన కౌతాళం మండల నాయకులు రామాంజినేయులు కోరారు. పవన్ కల్యాణ్ చెప్పిన విధంగా ప్రజా వ్యతిరేక ఓటును చీలనివ్వకుండా జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపడమే కూటమి ఆశయమని తెలిపారు. టిడిపి సైకిల్ గుర్తే జనసేన గుర్తుగా భావించి టిడిపి అభ్యర్థిని గెలిపించాలని జనసేన పెద్దకడుబూరు మండల అధ్యక్షులు గణేష్ తెలిపారు. చంద్రబాబు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా వ్యక్తి పవన్ కల్యాణ్ అని టిడిపి కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్ పేర్కొన్నారు. టిడిపి యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి, జనసేన మండల నాయకులు బీవీ.రవిచంద్ర, రామాంజినేయులు, ఏసోబు, నర్సప్ప, అనుమేష్ పాల్గొన్నారు.



రాఘువేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గాలి మాటలొద్దు..

- ఆధారాలు నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు

ప్రజాశక్తి - ఆదోని

మట్కా, పేకాట, భూదందాలకు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పాల్పడుతున్నారన్న గాలి మాటలు వద్దని, ఆధారాలతో నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు కూటమి అభ్యర్థి పార్థసారథికి సవాలు విసిరారు. ఆదివారం ద్వారకా హోటల్‌లో కౌన్సిలర్లు బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్, యూత్ లీడర్ భాస్కర్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన మంచితనానికి నిదర్శంగానే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పారు. ఐదేళ్లలో అన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు, కల్లుబావి వీధిలో తాగునీటి ఎద్దడి రాకుండా పైపులైన్లు ఏర్పాటు చేయించి శాశ్వతంగా తాగునీరు ఇస్తారని, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాలకు సైతం తాగునీటి సదుపాయం కల్పించారన్నారు. సుమారు రూ.50 కోట్ల అభివృద్ధి పనులు పట్టణంలో జరిగాయని, తమ వెంట వస్తే చూపిస్తామని తెలిపారు. కబ్జాలకు పాల్పడుతున్నారని పార్థసారథి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూములకు సంబంధించిన రికార్డులు ఉన్నా బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని కబ్జా అంటారని, అలా ఎక్కడైనా ఎమ్మెల్యే పాల్పడి ఉంటే చూపించాలని తెలిపారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన పార్థసారథికి ఏమాత్రం ఓట్లు వచ్చాయో గమనించాలన్నారు. రాజకీయ లబ్ధి కోసమే అడ్డదారుల్లో ఎమ్మెల్యే సీటు తెచ్చుకొని ఐదేళ్ల తర్వాత ఆదోని వైపు దృష్టి సారించారని తెలిపారు. ఆదోని ప్రజలపై ఎనలేని ప్రేమ ఉన్నట్లు కపట నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. రాజకీయ స్వలాభం వదిలి చిత్తశుద్ధి ఉంటే ఆదోని కోసం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ఎవరైనా అడగవచ్చని తెలిపారు. లేనిపోని సమస్యలు సృష్టిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే కోసం అహర్నిశలు కృషి చేసే సైనికులు ఉన్నామని, విమర్శలు చేస్తే తిప్పికొట్టేందుకు కూడా వెనకాబోడమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

వైసిపి కోకన్వీనర్‌గా సత్తిరెడ్డి

- అందరి సహకారంతో పార్టీ అభివృద్ధికి కృషి
- సత్తిరెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపి మండల కోకన్వీనర్‌గా నేమకల్లు గ్రామానికి చెందిన సత్తిరెడ్డిని ప్రకటించారు. ఆదివారం నేమకల్లులో సర్పంచి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి పార్టీ నాయకుల సూచనల మేరకు సత్తిరెడ్డిని ప్రకటించారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి సురేష్ రెడ్డి, నగరడోనా భీమ రెడ్డి, కుందనగుర్తి దివాకర్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, కృష్ణారెడ్డి, గిరిలు సత్తిరెడ్డికి పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. సత్తిరెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి, కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచి ప్రేమ్ కుమార్ తనపై ఈ బాధ్యత ఉంచినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో విరుపాక్షికి అధిక మెజార్టీ చూపిస్తానని చెప్పారు. వైసిపి గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సత్తిరెడ్డిని సన్మానిస్తున్న విరుపాక్షి, వైసిపి నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆస్పరి

స్నేహంలో ఉన్న మాధుర్యాన్ని పూర్వ విద్యార్థులు గుర్తించుకొని ఆత్మీయ కలయిక సమావేశాన్ని ఆదివారం ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక్కసారిగా కలవడంతో పాఠశాల ఆవరణంలో సందడిగా కనిపించింది. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని తాము చదువుకున్న రోజుల్లోని మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు వెంకన్న, మాబు, విజయ్ కుమార్, రుద్రప్పకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. గురువులు మాట్లాడుతూ... తాము చదువు చెప్పిన విద్యార్థులు తమను గుర్తించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు రఘు, సుభాన్, రాము, రాజు, హరి, విశ్వనాథ్ రెడ్డి, శీను, రంగస్వామి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ హనుమంతప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు బ్యాంకు, ప్రభుత్వ కార్యాలయాలకు పనుల కోసం ఆస్పరికి వస్తూ వెళ్తుంటారని తెలిపారు. వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని కొనియాడారు. ఇలాగే గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. మండల ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సెక్రటరీ పాలూరి పవన్ కుమార్, కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ హనుమంతప్ప

రంజాన్ మాసంలో ఉపవాసం ఉండడం మంచిది

- టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ

ప్రజాశక్తి - చిప్పగిరి

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండడం చాలా మంచిదని టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన వారందరికీ ఆదివారం నేమకల్లు గ్రామంలో లాయర్ షేక్షావలీ స్వగృహంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపవాస దీక్షలంటే శాంతి చిహ్నమని తెలిపారు. రంజాన్ పండగలో ప్రధాన ఘట్టం ఉపవాస దీక్షలన్నారు.



ఉపవాసం ఉన్న వారికి ఇఫ్తార్ విందు ఇస్తున్న షేక్షావలీ

వైసిపిని మళ్లీ గెలిపించాలి

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలంటే రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కోసిగిలోని 3, 6వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైసిపి ప్రభుత్వం రావాలని తెలిపారు. ఒక ఓటు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాల నాగిరెడ్డికి, మరో ఓటు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్య ఫ్యాను గుర్తుకు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



ప్రచారం నిర్వహిస్తున్న మురళీ మోహన్ రెడ్డి



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న గౌరు చరిత రెడ్డి , వేదికపై బైరెడ్డి శబరి

టిడిపి పాలనలో బిసిలకు పెద్దపీట

కల్లూరు మండల జయహో బిసి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గం దుపాడు జాతీయ రహదారి సమీపంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో కల్లూరు మండలం జయహో బిసి ఆత్మీయ సమావేశం పాణ్యం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, గౌరు చరిత రెడ్డి మాట్లాడారు.

టిడిపి పాలనలో బిసిలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక బిసి నాయకుడు కార్యకర్త టిడిపి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకేపోగు వెంకట స్వామి, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మాదేష్, నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు మల్లికార్జున, మండల నాయకులు పుసులూర్ ప్రభాకర్ రెడ్డి, ఉలిందకొండ ఇవి రమణ, కల్లూరు అర్బన్ ఉపాధ్యక్షుడు పెద్ద బీచు పల్లి,పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్ చౌదరి, రాయలసీమ విద్యార్థి విభాగం జెఎసి అధ్యక్షులు శ్రీరాములు, కేతురు మధు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, అర్బన్ నాయకులు కురువ ధనుంజయ, జనసేన నాయకుడు తడకనపల్లే సలాం, తదితరులు పాల్గొన్నారు.

వరిపొట్టు ముసుగులో మద్యం రవాణా

-పంచలింగాల సెబ్ చెక్పోస్ట్ వద్ద పట్టుబడిన 11,520 లిక్కర్ బాటిళ్లు
-స్వాధీనం చేసుకున్న లిక్కర్ బాటిళ్లు వాహనం, మొబైల్ ఫోన్
-మొత్తం విలువ రూ.18.51 లక్షలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగర శివారులోని పంచలింగాల సెబ్ చెక్‌పోస్టు వద్ద భారీ ఎత్తున మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు, తాలూకా పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు సమన్వయ కృషితో శనివారం రాత్రి పట్టుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన కర్నూలు సెబ్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సెబ్ ఎఇ ఎస్‌బి.వినోద్ కుమార్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కడప జిల్లా, చాపాడు మండలం, ఖాదర్‌పల్లికి చెందిన నిందితులు చింపర్తి రింగుల బాష, కందనూరు హబీబుల్లా, పట్టాను సాదక్, షేక్‌షఫీలపై కేసు నమోదు చేశామన్నారు. రింగుల బాష అనే వ్యక్తి గత అనేక సంవత్సరాలుగా కరుడుగట్టిన నేరస్తుడుగా పలు కేసులో ఉన్నారన్నారు. ఇతని పై104 కేసులు ఇదివరకు నమోదయ్యాయని అన్నారు. అందులో ప్రధానంగా అక్రమంగా మద్యం రవాణా, ఎర్రచందనం రవాణా, పోలీసు అధికారులపై దాడులు చేయడం వంటి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్నారు. రింగుల బాష వాహన ట్రాన్స్‌పోర్టర్‌గా వ్యవహరిస్తూ అతనికి సహాయకుడిగా కందనూరు హబీబుల్లతో కలిసి ఇలాంటి నేరాలను రచిస్తుంటారన్నారు. అందులో భాగంగా శనివారం రింగుల బాష కందనూరు హబీబుల్లాకు చెందిన వాహనాన్ని వారి స్వగ్రామమైన ఖాదర్పల్లి వాసి డ్రైవర్ పటాన్ సాధకుకు హెల్పర్ షేకు షఫీకి దోస్తు వాహనాన్ని ఇచ్చి జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం జింకలపల్లిలో ఎస్‌వి వైన్స్‌లో భారీ ఎత్తున మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి కడప జిల్లాలో మైదుకూరు ప్రొద్దుటూరుకు తరలించే దశలో శనివారం సాయంత్రం సుమారు ఆరున్నర గంటల సమయంలో వంచ లింగాల చెక్పోస్ట్ వద్ద స్థానిక పోలీసుబృందం తనిఖీ చేశారు. మొదట అందులో వరి పొట్టు రవాణా చేస్తున్నామని బుకాయించినప్పటికీ అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా తనిఖీ చేయగా భారీ ఎత్తున మద్యం బాటిల్లు బయటపడ్డాయన్నారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 240 బాక్సుల మద్యం, దోస్తు వాహనాన్ని రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. లిక్కర్ బాటిళ్ల మొత్తం విలువ రూ.14,51520, వాహనం విలువ రూ. నాలుగు లక్షలు మొత్తం కలిపి రూ.18.51 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు లోతైన తదుపరి విచారణ కోసం వినోద్ కుమార్, కర్నూలు సెబ్ సీఐ రవీంద్ర నేతృత్వంలో రెండు బందాలను నియమించమని తెలిపారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే ఎంత వారయినా వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు తెలిస్తే తనకు సమాచారం అందజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన సెబ్ ఎస్ఐ పృధ్వీరాజ్ కు కానిస్టేబుళ్ల నరసింహులు, రామలింగయ్య, ఎస్ఐ మారుతి ప్రసాద్, తాలూకా సిఐ పేరయ్య, మధుసూదన్ తదితరులను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా వారికి రివార్డులను అందజేశారు



పట్టుబడిన మద్యం బాటిళ్లతో స్పెషల్ ఎన్‌పోర్స్‌మెంట్ సూపరిన్‌టెన్‌డెంట్ రవికుమార్



చిన్నటేకూరులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ జనసేన నాయకులు కల్లూరు మండల అధ్యక్షుడు వై.బజారీ ఆధ్వర్యంలో చిన్నటేకూరు శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతో జనసేన చలివేంద్రాన్ని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా బజారి మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహమ్ తీర్చేందుకు 10 సంవత్సరాల నుండి చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 20 గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు కలుస్తున్నారని మధ్యాహ్న సమయంలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ఉచితంగా చలివేంద్రం ప్రారంభించామన్నారు. వారంలో ఒకరోజు మజ్జిగ మరొక రోజు బెల్లం పానకం మిగతా రోజులు మినరల్ వాటర్ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు వెంకటసుబ్బయ్య, మత్స్యకార విభాగ కమిటీ రాష్ట్ర కార్యదర్శి తెలుగు గోవిందరాజు, సి హుస్సేన్ పవర్, నియోజకవర్గ జనసేన నాయకులు బి.సుధాకర్, షబ్బీర్, నాగేష్, భాస్కర్, అంజి, శివ, సలాం, రాజు, వరప్రసాద్, మంజు, రాజేంద్ర, రవి, రంగస్వామి, ఎల్లా రాముడు, బి.అంజి, జి.శివ, తిమ్మరాజు, శివ నబిసాబ్, ఖాజావలి, మాధవయ్య గ్రామ జనసైనికులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో సిపిఎం నాయకులు

నిరంతరం పోరాడే సిపిఎంకు ఓటు వేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై రోజురోజుకు ధరలు, పన్నులు వంటి భారాలు పెరుగుతున్నాయని సిపిఎం జిల్లా నాయకులు పి.గోవిందు, కర్నూలు నగర నాయకులు డి.అబ్దుల్ దేశాయ్ పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం 12వ వార్డు డబరాలో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై 420 శాతం ధరలు పెరిగాయని అన్నారు. మరో పక్క సంపన్నులకు రూ.12 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేశారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో పన్నుల రూపంలో ప్రజలపై విపరీతంగా భారాలు వేయడం వల్ల కొనలేని, తినలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బేటి పడావో బేటి బచావో అని మోడీ ఒకపక్క చెప్పుతూ, మరోపక్క మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించి హత్య చేస్తే మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. మతతత్వ విధానాలను అధిక భారాలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన కూడబలుక్కొని బిజెపికి వంత పాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా, సిగ్గు విడిచి బిజెపికి మద్దతు ఇవ్వడం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడం కాదా అని ప్రశ్నించారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు గురుస్వామి, సిద్దయ్య, సుంకన్న, శ్రీనివాసులు, గోపాల్, ఆంజనేయులు, రఫీక్, ఎస్. వెంకటేశులు, వేణుగోపాల్, పరశురాములు, మణికుమార్, కేశాలు, అనిల్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై కళారూపాల ద్వారా ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా, భారత ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన, 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ ఆదేశాల మేరకు స్వీప్(సిస్టమేటిక్ వాటర్ సే ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఓటర్ అవగాహన కార్యక్రమం నగరంలోని బిర్లా గేట్ ఖానా ఖజానా వద్ద ఆదివారం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారితో మొదలైన సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో అధికారులు ప్రజలు పాల్గొని తమ హస్తాక్షరాలతో మేము కూడా ఓటు వేస్తాం అంటూ చాటుకున్నారు. తర్వాత చిన్నారులు చేసిన ఆత్మరక్షణా కళల ప్రదర్శనలు చూపరులను కట్టిపడేసింది.

ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ 'ఓటు విలువను తెలుసుకోండి అన్నల్లారా... అక్కల్లారా...' అంటూ కళాజాత బృదం చేసిన నినాదాల పాటలు ఆకట్టుకున్నాయి. రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ ప్రసంగిస్తూ 2024 ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓటు హక్కు వినియోగం, 100 శాతం నమోదు సాధించేలా ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ పివి రామలింగేశ్వర్, ఎలక్షన్ డిటి. ధనుంజయ , ఎఇ.దినేష్ , ఎఇ జనార్ధన్ , సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుబ్బయ్య, చింతాసురేష్ తదితరులు



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైసిపిలో చేరిన పందిపాడు టిడిపి యువకులు

టిడిపి నుంచి వైసిపిలోకి పందిపాడు యువకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ పరిధి కల్లూరు అర్బన్ 28వ వార్డ్ పందిపాడు గ్రామంలోని దాదాపు 50 తెలుగుదేశం పార్టీ కుటుంబాలు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పాణ్యం యువనేత కాటసాని శివ నరసింహరెడ్డి సమక్షంలో కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి,వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు భీమేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి చేరారు. ఎమ్మెల్యే కాటసాని ఒక్కొక్కరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం అని అన్నారు. నాగభూషణం, వెంకటేశ్వర్లు, రాజు, పర్ల వెంకటేశ్వర్లు, బోయకృష్ణ, శంకర్, చిన్న రాజు ,పెద్ద రాజు,సురేష్ , దనుంజయ, సూరి తదితర 50 కుటుంబాలు పార్టీ లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ రెడ్డి, బిఆర్ రెడ్డి కాలనీ రవి, రామకృష్ణ, అయ్యప్ప, మల్లి కర్జున, శివుడు, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి భారీ చేరికలు

కండువాలు కప్పి ఆహ్వానించిన టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలో టిడిపిలోకి వాళ్ళ కుటుంబాలు భారీ ఎత్తున వచ్చి చేరాయి. ఆదివారం అనుగొండ గ్రామం పులకుర్తి నుంచి కర్నూలు జిల్లా టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, ఎంపీ సంజీవ్ కుమార్ సమక్షంలో ఆ కుటుంబాలను సాదరంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనుగొండ రామలింగం మండల సమన్వయ కార్యకర్త ఆధ్వర్యంలో గ్రామం నుంచి 200కు పైగా టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రామలింగం, వెంకటేష్, వెంకటరాముడు, చంద్ర,రామదాసు, సుంకన్న, ఆచారి, మల్లయ్య, రామ గిడ్డయ్య, పరమేష్, సుంకన్న, జయాన్న, మధు, వెంకట రాముడు, తిమ్మప్ప, ఆచారి, రామచంద్రుడు, సుంకన్న వెంకటేష్, రామాంజనేయులు, రాజశేఖర్, శివన్న, తిక్క సున్నయ్య, దాసు, వేణుగోపాల్ తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పులకుర్తి గ్రామం నుంచి త్రివేది యూత్ టిడిపికి మద్దతుగా నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డిని గజమాలతో సన్మానించారు. యూత్ సభ్యులు..అనంతరం కోడుమూరు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరికీ మాసాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మద్దతు తెలిపిన త్రివేది యూత్ సభ్యులు సుంకన్న, రంగన్న, శ్రీను, చిన్న ఎల్లప్ప,నాగప్ప,చిన్న రంగన్న, గోపాల్, రాఘవేంద్ర, హనుమంతు, మద్దిలేటి, పెద్ద హనుమంతు, పెద్ద రంగన్న, రామకృష్ణ,పెద్ద సుంకన్న, నరసప్ప, నాగప్ప, మధుగోపాల్, సుంకప్ప, నల్లి రెడ్డి, పెద్ద హనుమంతు, చిన్న హనుమంతు, సుంకన్న, సురేష్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న పలువురు



41 వ వార్డులో ఎమ్మెల్యే కాటసాని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ పరిధి కల్లూరు అర్బన్ 41వ వార్డులో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి ని చేసుకుందాం అని చెబుతూ ప్రచారం లో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో 41 వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతా రెడ్డి, అర్బన్ లోని పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -పత్తికొండ


టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కంపెనీ వారు రైతు రామాంజనేయులు భూమిలో అక్రమంగా తవ్వకాలు నిలిపివేయాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఈశ్వర్ రెడ్డి భవనంలో పత్రికా విలేకరుల సమావేశంలో రంగారెడ్డి, రైతు రామాంజనేయులు మాట్లాడుతూ పత్తికొండలోని సర్వే నంబర్ 2861ఎ - 2.20 భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెల రోజులు నుండి తమ పొలంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పేర అక్రమంగా తవ్వకాలను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చినా పనులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని , టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కంపెనీ వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కలగజేసుకుని రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకుడు గంగన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి కుంభకర్ణుడు

- 'వివేకా' హంతకులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు
- నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను నిలబడ్డాను
- మూడో రోజు బస్సు యాత్రలో వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-కమలాపురం (వైఎస్‌ఆర్ జిల్లా)

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుంభకర్ణుడని, నాలుగున్నరేళ్లు నిద్రపోయి ఎన్నికలకు ఆరు నెలల ముందు నిద్రలేచారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారంనాడు మూడో రోజు బస్సుయాత్ర కొనసాగింది. నియోజకవర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, విఎన్ పల్లె, సికెదిన్నె, చెన్నూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రం అక్రమాలు, దౌర్జన్యాలు, హత్యలు, దోపిడీలమయంగా మారిందన్నారు. ఇసుక, మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ వైఎస్‌ఆర్ కల అని అన్నారు. జగన్ శంకుస్థాపనలు చేశారే తప్ప ప్రాజెక్టు ముందుకు కదల్లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లయినా ఇంతవరకు హంతకులకు శిక్ష పడలేదని వాపోయారు. హత్యచేసిన వాళ్లు అధికారం అడ్డు పెట్టుకుని దర్జాగా తిరుగుతున్నారని, అన్ని ఆధారులూ ఉన్న చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అవినాష్‌రెడ్డే హంతకుడని సిబిఐ చెప్పిందని, అలాంటి వ్యక్తికే జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇది హత్యా రాజకీయాలను ప్రోత్సహించినట్లేనని అన్నారు. నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే తాను ఎంపిగా పోటీ చేస్తున్నానని ఆమె తెలిపారు. ఒక వైపు ధర్మం, మరో వైపు డబ్బు ఉందని, ప్రజలు ఎవరిని గెలిపించాలో ఆలోచన చేయాలని అన్నారు.



కమలాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ఆదిమూలం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన షర్మిల

పెండ్లిమర్రిమండలం యాదవపురం గ్రామంలో వారం రోజుల కిందట ఆదిమూలం శ్రీనివాస్‌యాదవ్ హత్యకు గురికావడంతో ఆయన కుటుంబాన్ని వైఎస్ షర్మిల పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యంత దారుణంగా కాల్చి హత్య చేశారని పేర్కొన్నారు. నిందితులు ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరులేనని ఆరోపించారు.

షర్మిలను ఎంపిగా చూడాలనేది వివేకా కోరిక : సునీత

షర్మిలను ఎంపిగా చూడాలని తన తండ్రి కోరిక వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత అన్నారు. షర్మిలతో కలసి బస్సుయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పక్కా స్కెచ్‌తోనే తన తండ్రిని హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య విషయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాటలూ విడ్డూరంగా ఉన్నాయని పేర్కొన్నారు.